క్లుప్తంగా

గుండుగొలను వద్ద వాహనాల క్రమబద్ధీకరణ



గుండుగొలనులో వాహనాలను క్రమబద్ధీకరిస్తున్న పోలీసులు

భీమడోలు: సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి వెళ్లే వాహనాలతో బుధవారం ఉదయం జాతీయ, రాష్ట్రీయ రహదారులపై రద్దీ నెలకొంది. రాజమండ్రి, రావులపాలెం తదితర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో వాహనాలు గన్నవరం వైపుగా వెళ్తుండడంతో ఒక్కసారిగా గుండుగొలను వద్ద ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీనితో రహదారులపై రాకపోకలు సాగించే వాహనాదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో గన్నవరం వైపు వెళ్లే వాహనాలకు పోలీస్ ఆంక్షలు విధించి, వాహనాలను నిలుపుదల చేయించారు. సీఎం ప్రమాణ స్వీకారానికి వెళ్లే పాసులున్నా వాహనాలకు మాత్రమే పోలీసులు అనుమతులు ఇచ్చారు. మిగిలిన వాహనాలను నిలుపుదల చేశారు. మండలంలోని గుండుగొలను జంక్షన్ వద్ద ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు అధికారులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి వాహనాలను పంపారు.

విగ్రహాలకు ముసుగు తొలగింపు



వైఎస్సార్ విగ్రహానికి ముసుగుతీసిన దృశ్యం

దెందులూరు: దేశంలో ఎన్నికల కోడ్ ఎత్తివేస్తూ కేంద్ర ఎన్నికల కమిషనర్ ప్రకటించి నాలుగు రోజులు కావస్తున్నా గ్రామాల్లో నాయకుల విగ్రహాల ముసుగులు తీయడం లేదు. అన్ని పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన అనంతరం నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. కోడ్ ముగిసినా పంచాయతీ ఉద్యోగులు స్పందించకపోవడంతో బుధవారం శ్రీరామవరంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అక్కినేని శ్రీనివాసరావు, నాయకులు, వార్డు మెంబర్లు, కార్యకర్తలు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి ముసుగు తొలగించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీతంపేటలో సైతం వైఎస్సార్‌సీపీ నాయకులు దివంగత వైఎస్సార్ విగ్రహానికి ముసుగు తొలగించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సీహెచ్‌సీలో సిబ్బంది కొరత

దెందులూరు: దెందులూరులో ఉన్న నియోజకవర్గ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)కి వైద్యసిబ్బందిని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 2.70 కోట్లతో సీహెచ్‌సీని 30 పడకల వైద్యశాలగా అభివృద్ధి చేసింది. ఈ వైద్యశాలకు అంబులెన్స్‌లు, సాంకేతిక వైద్యపరికరాలు, వైద్యులు ఉన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు చేసిన అభివృద్ధి కారణంగా వైద్యశాలకు వచ్చే రోగుల సంఖ్య రోజుకు 130–150కు పెరిగింది. వైద్యులు ఉన్న వైద్యసేవలందించేందుకు పరీక్షలు చేసేందుకు సిబ్బంది కొరత కనిపిస్తోంది. వైద్యశాలలో ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఆరుగురు శానిటరీ సిబ్బంది, నలుగురు సెక్యూరిటీ గార్డులు అవసరం ఉంది. నూతన ప్రభుత్వం సీహెచ్‌సీకి స్టాఫ్ నర్సులు, శానిటరీ సిబ్బంది, సెక్యూరిటీ గార్డుల పోస్టులను మంజూరు చేస్తే మరింత మెరుగైన వైద్యసేవలు సకాలంలో అందించేందుకు వీలు ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.

గన్నవరం తరలిన కూటమి శ్రేణులు

భీమడోలు: రాష్ట్ర సీఎం నారా చంద్రబాబునాయుడు, మంత్రులుగా పవన్ కల్యాణ్, నారా లోకేష్ తదితరుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బుధవారం మండలంలోని నాయకులు భీమడోలు నుంచి బస్సుల్లో గన్నవరం వెళ్లారు. రావిచెట్టు సెంటర్ వద్ద భారీ టీవీ తెరను ఏర్పాటు చేసిన ప్రమాణోత్సవాన్ని వీక్షించారు. మాజీ జెడ్పీటీసీ కరణం పెద్దిరాజు, టీడీపీ నేత గన్ని భరత్, జనసేన అధ్యక్షుడు ప్రత్తి మదన్‌ల నేతృత్వంలో శ్రేణులు గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

ప్రైవేటుకు దీటుగా సర్కారు బడుల ప్రచారం

- పెరుగుతున్న ప్రవేశాలు
- నేటి నుంచి తెరుచుకోనున్న ప్రభుత్వ బడులు

గణపవరం: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఉపాధ్యాయులు వినూత్న ప్రచార కార్యక్రమాలతో ప్రైవేటు పాఠశాలలకు సవాల్ విసురుతున్నారు. నిన్నటి వరకూ ఎన్నికల ప్రచారంతో హోరెత్తిన గ్రామాలు ఇప్పుడు పాఠశాలల్లో ప్రవేశాల కోసం ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. తమ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, బోధన, తదితర అంశాలను వివరిస్తూ చిన్నారులను ఆకర్షించేందుకు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇప్పటి వరకూ ప్రైవేటు పాఠశాలలకే పరిమితమైన ఈ తరహా ప్రచారంలోకి ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలూ వచ్చి చేరడంతో మీ పిల్లలను మా బడికే పంపండంటూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఒకరికొకరు పోటీపడుతూ ప్రచారాన్ని సాగిస్తున్నాయి. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు కొదవ ఉండేది కాదు. ఐదేళ్లు నిండిన పిల్లలను తల్లిదండ్రులు తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేవారు. రానురాను పరిస్థితులు మారిపోయాయి. ఆంగ్ల మాధ్యమం, మూడేళ్లకే కాన్వెంట్లలో ప్రవేశాలు కల్పించడంతో తల్లిదండ్రుల చూపు ప్రైవేటు స్కూళ్ల వైపు మళ్లింది. అరకొరగా ప్రవేశాలుండటంతో ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకమయ్యేలా పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. ఇటీవల మన బడి నాడు– నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చివేసి కార్పొరేట్ తరహాలో సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయుల నియామకాలు, విద్యార్థులకు ఉచితంగా పాఠ్య,



పిల్లలను బడిలో చేర్పించమని ఇంటింటి ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు, టై, బెల్టు, బూట్లు, స్కూలు బ్యాగులు వంటివి ఉచితంగా అందిస్తున్నారు. రుచికరంగా నాణ్యమైన ఆహారాన్ని మధ్యాహ్న భోజన పథకంలో అందిస్తున్నారు.

ఇంటింటికీ వెళ్లి ప్రచారం

ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు కొంతమేర నమ్మకం ఏర్పడి, ఇటీవల ప్రవేశాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. దీనితో ఉపాధ్యాయులు కూడా ఆయా పాఠశాలల్లో ప్రవేశాలను పెంచుకోవడానికి ప్రత్యేక ప్రచార బాట పట్టారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోనూ ఈ వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులు బృందాలుగా ఏర్పడి ఆయా గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేసి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సదుపాయాలను వివరించడమే కాక ఉపాధ్యాయుల అర్హతలు, అనుభవం వివరించి, ఇటీవల పాఠశాల విద్యార్థుల ప్రగతిని వివరిస్తూ మీ పిల్లల భవిష్యత్తుకు మాది భరోసా అంటూ తల్లిదండ్రులను ఒప్పించి ప్రభుత్వ పాఠశాల్లో నమోదు చేసుకుంటున్నారు. ఒకప్పుడు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు మాత్రమే మైకులు కట్టి, రిక్షాలు, ఆటోలు, వ్యాన్లు ఏర్పాటు చేసి గ్రామాల్లో ప్రచారం ఊదరగొట్టేవారు. కాన్వెంట్ ఉపాధ్యాయులు బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి పిల్లల పేర్లు నమోదు చేసుకుని వారి స్కూళ్లల్లో చేర్చుకునేవారు. దీనితో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు గండి పడింది. ఈ ప్రమాదాన్ని గ్రహించిన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు మే నెల చివరి వారం నుంచి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తూ తల్లిదండ్రులతో మాట్లాడి వారిని ఒప్పించి మరీ పిల్లలను చేర్చుకుంటున్నారు.



బ్యానర్ కట్టి ఆటోలో మైకు ద్వారా ప్రచారం చేస్తున్న దృశ్యం

ఈ విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు	
గణపవరం	4,462
నిడమర్రు	3,083
ఉంగుటూరు	6,291
భీమడోలు	4,893

800 మంది చేరిక

గణపవరం, నిడమర్రు మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పది రోజులుగా గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ పిల్లల అడ్మిషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రెండు మండలాల్లో ఈవిద్యా సంవత్సరంలో ఇలా ఇంటింటికీ తిరిగి సుమారు 800 మంది వరకూ 1వ తరగతిలో చేర్పించడానికి తల్లిదండ్రుల వద్ద అంగీకారం తీసుకున్నారు. రానున్న కాలంలో ఉపాధ్యాయులు ఈ ఇంటింటి ప్రచారం కార్యక్రమం ద్వారానే మరింత ఎక్కువ మంది పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేసుకోవడానికి సిద్ధమవుతున్నారు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత అర్హతలు ఉన్న అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్య అందుతుంది. ప్రైవేటుకు దీటుగా ఆంగ్ల మాధ్యమంలోనూ బోధన చేస్తున్నాం. పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించాం. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు వారం రోజుల నుంచి వారి పరిధిలో ఇంటింటికీ తిరిగి నూతన అడ్మిషన్లు నమోదు చేస్తున్నారు.

– పుచ్చల శేషు, ఎంఈవో, గణపవరం

బడి తెరిచే రోజునే పాఠ్య పుస్తకాలు



మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఆయా తరగతులకు సంబంధించి పాఠ్య పుస్తకాలను ఇప్పటికే అందించాం. రెండు రోజులుగా వచ్చిన నోటు పుస్తకాలను, డిక్షనరీలు, బెల్టులు తదితర సామగ్రిని ఆయా పాఠశాలలకు చేరవేస్తున్నాం. ఇప్పటికే ఎండీఎం నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు సిద్ధం చేయించాం. గుడ్లు, రాగిజావ, బెల్లంపాడి అందజేశాం. బడి తెరిచేరోజునే విద్యార్థుకు పాఠ్యపుస్తకాలను అందజేస్తాం.

– కె.రాంబాబు, ఎంఈవో, నిడమర్రు

బడికి వేళాయె..



పాఠశాలకు చేరిన పాఠ్యపుస్తకాల వద్ద ఉపాధ్యాయిని

- పాఠ్య పుస్తకాల పంపిణీకి సర్వం సిద్ధం
- నియోజకవర్గంలో అన్ని పాఠశాలల్లో ఏర్పాట్లు పూర్తి

దెందులూరు: వేసవి సెలవులు ముగిసిన అనంతరం పాఠశాలలన్నీ గురువారం నుంచి పునః ప్రారంభం కానున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలతో అమలు చేసిన సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రూపుదిద్దుకున్నాయి. ఇందులో భాగంగా పునః ప్రారంభం రోజునే అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల ఫలితం నేడు విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సకాలంలో పుస్తకాలు అందనున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ముందు విద్యార్థులకు పాఠశాలలు తెరిచి 3, 4 నెలలైన తరువాత అరకొర పుస్తకాల పంపిణీ చేసేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పుస్తకాలకు ఎటువంటి కొరత లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకున్నారు. నాణ్యమైన విద్య, తరగతి గదులు, భోజనంతో పాటు పుస్తకాలు పంపిణీ, విద్యకు సంబంధించి అన్ని అంశాలు నూరు



పెదపాడులో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి

నియోజకవర్గాల వారీగా		
మండలం	పాఠశాలలు	విద్యార్థులు
దెందులూరు	53	4,553
పెదవేగి	67	6,946
పెదపాడు	56	4,640
ఏలూరు రూరల్	58	17,167
మొత్తం	234	31,306

శాతం ఫలితాలు వచ్చేలా అమలు చేయడం వాటిని పర్యవేక్షించడం రాష్ట్ర ప్రభుత్వం తొలి ప్రాధాన్యతగా ప్రకటించడంతో ఉపాధ్యాయవర్గాల్లో సైతం బాధ్యత, అంకితభావం పెరిగింది. పాఠశాలలు పునః ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా విద్యాశాఖాధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లా కేంద్రం నుంచి నియోజకవర్గంలో అన్ని మండలాల ఎంఈఓ కార్యాలయాలకు పాఠ్య పుస్తకాలు వచ్చాయి. వాటిని ఎంఈఓలు, పాఠశాలల హెచ్ఎంలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమ అమలుకు ప్రత్యేక అధికారులను సైతం నియమించారు. కలెక్టర్, డీఈఓ, డీవైఈఓ, మండలాల ఎంఈఓలు నిరంతరం పర్యవేక్షణ చేస్తారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

పెదపాడు: మండలంలోని వివిధ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పెదపాడు మండలంలోని వివిధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు 8,9,10 తరగతులకు చెందిన పుస్తకాలు పంపిణీ చేశారు. ఇంకా కొన్ని తరగతులకు చెందిన కొన్ని పాఠ్య పుస్తకాలను అందించాల్సిన అవసరముందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు, పాఠశాలల సిబ్బంది, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం



రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్, డీఈఓ ఆదేశాల మేరకు పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేందుకు చర్యలు తీసుకున్నాం. పుస్తకాలు అన్ని పాఠశాలలకు చేరాయి. హెచ్ఎంలకు ఇప్పటికే ఎంఈఓ కార్యాలయాల నుంచి పుస్తకాలు పంపిణీచేశాం.

– ఏపీఎస్‌వీ ప్రసాద్, దెందులూరు ఎంఈఓ

పాఠ్యాంశాలపై అవగాహన



బడి ప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాలు అందించడం వల్ల విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుంది. సబ్జెక్టుల పరంగా విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన ప్రారంభం నుంచి పూర్తిస్థాయిలో అవగాహన ఏర్పడుతుంది. పాఠ్యాంశాల్లోని 75 శాతం సారాంశాన్ని పాస్తకాల ద్వారా విద్యార్థులు తెలుసుకోగలుగుతారు.

– పసుమర్తి రామశర్మ, హెచ్ఎం, దెందులూరు జెడ్పీహైస్కూల్

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ఉంగుటూరు: పాఠశాలలు తెరిచే రోజునే విద్యార్థుల చేతుల్లో పుస్తకాలు ఉండాలనే ఉద్దేశ్యంతో ఉంగుటూరు మండలంలోని విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే పాఠశాలలకు పుస్తకాలు చేరాయి. మండలంలో 1 నుంచి పదవ తరగతి వరకు సెమిస్టరు–1లో కామన్ పుస్తకాలు 31,378 విద్యార్థులకు పంపిణీ చేశారు. రెండు దఫాలుగా ఈ పుస్తకాలు మండలానికి వచ్చాయని ఎంఈవో రవీంద్రభారతి, ఎంఈవో– 2 శ్రీనివాసరావు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలల హెచ్ఎంల ద్వారా విద్యార్థులకు పుస్తకాలు అందజేసే ప్రక్రియ బుధవారం ప్రారంభించినట్లు రవీంద్రభారతి తెలిపారు. 22,000 పుస్తకాలు రెండో దఫాలో వస్తాయని వాటిని రాగానే విద్యార్థులకు పంపిణీ చేస్తామని తెలిపారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మండల విద్యాశాఖాధికార్లు రవీంద్రభారతి, శ్రీనివాసరావు

ఏఎంసీ చైర్‌పర్సన్ పదవికి నీలిమ రాజీనామా



ఇంజేటి నీలిమ

భీమడోలు: భీమడోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ జూనియర్ తన పదవికి రాజీనామా చేశారు. సంబంధిత పత్రాలను ఉన్నతాధికారులకు బుధవారం అందజేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రెండు పర్యాయా లు చైర్‌పర్సన్‌గా ఆమె పని చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి చెందడంతో వ్యక్తిగత బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేశానన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేసి వారి కుటుంబాలు ఆర్థిక స్వావలంబన సాధించేలా తనవంతు కృషి చేశారన్నారు. తన హయాంలో 2019 నుంచి మార్కెట్ సెస్ కింద రూ.11.20 కోట్లు, సివిల్ సప్లయిస్ శాఖ నుంచి రూ.7 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. మండలంలో రూ.4 కోట్లతో బీటీ రోడ్లు, రూ.3 కోట్లతో పుంతరోడ్ల నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయని ఆమె పేర్కొన్నారు. ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు నమ్మకం ఉంచి అప్పగించిన ఈ పదవికి తగిన న్యాయం చేసేందుకు తన వంతు కృషి చేశానన్నారు. ఈ సందర్భంగా వాసుబాబుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

హామీలన్నింటినీ అమలు చేయాలి

ఏలూరు (టూటౌన్): నూతనంగా ఏర్పడిన టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల్ని రాజకీయ వివక్షతకు తావులేకుండా తక్షణం అమలు చేయాలని కోరారు. సూపర్ సిక్స్ గ్యారంటీలే కాకుండా ప్రజలకు ఇచ్చిన ఇతర సంక్షేమ పథకాలతో పాటు వాస్తవిక ప్రజాభివృద్ధికి తోడ్పడే అభివృద్ధి హామీల అమలుకు పూనుకోవాలని అన్నారు. మొత్తం 76 రకాల షెడ్యూల్ ఎంప్లాయిస్ కార్మికులకు నెలకు రూ.26 వేలు వేతనం తగ్గకుండా పెంచుతూ కనీస వేతనాల జీఓలను విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ రంగాల్లో పనిచేస్తోన్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసుల్ని వెంటనే క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం ఉద్యోగ, కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ, పండగ సెలవులు వంటి సౌకర్యాలతో పాటు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, వారిని రెగ్యులరైజ్ చేయాలని అన్నారు. భవన, ఇతర నిర్మాణ కార్మికుల బీఓసీ బోర్డును పునరుద్ధరించాలని, గత ప్రభుత్వాలు వాడుకున్న బీవోసీ నిధులను బోర్డుకు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఆటో, మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ప్రతి ఆటో డ్రైవర్ సహా క్యాబ్, లారీ డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందించాలని, జీఓ 21ని రద్దు చేయాలని కోరారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన కారణంగా నష్టపోయే ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అన్నారు. హమాలీ, ముఠా, జట్టు తదితర అసంఘటిత రంగ కార్మికుల ప్రయోజనాల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి వారికి ఉద్యోగ భద్రతతో పాటు చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని అన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ నిలిపివేతకు పూనుకోవాలని, గంగవరం, కృష్ణపట్నం పోర్టుల్ని అదానీకి అప్పగించిన గత ప్రభుత్వ ఒప్పందాల్ని రద్దు చేయాలని కోరారు. ప్రత్యేక హోదాతో సహా రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్యాకేజీలు, రైల్వే జోన్స్ వంటి రాష్ట్ర విభజన చట్టంలో ఉన్న అన్ని హామీల అమలు కోసం, మూసివేసిని జూట్ మిల్లులు, ఇతర పరిశ్రమల్ని తెరిపించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ, రాష్ట్ర కమిటీ సభ్యులు బద్దా వెంకట్రావు, ఎన్ నెహ్రూబాబు పాల్గొన్నారు.

నేరేడు పండు.. పోషకాలు మెండు

- ఆరోగ్య ప్రదాయిని, సర్వరోగ నివారిణిగా ప్రసిద్ధి
- కాయ నుంచి చెట్టు బెరడు వరకు ఔషధ భాండాగారం
- పండ్లకు మార్కెట్‌లో డిమాండ్

దెందులూరు: రక్తాన్ని శుద్ధి చేసి ఔషధ విలువలు, పోషకాలు మెండుగా ఉండే నేరేడు పండ్ల సీజన్ వచ్చేసింది. తినడానికి ఇవి కొంచెం తియ్యగా, కొంచెం వగరుగా ఉంటాయి. జంబు ఫలం, జామున్‌గా కూడా పిలుస్తారు. నేరేడు పండ్లను ఆయుర్వేద శాస్త్రంలో అపర సంజీవినిగా పిలుస్తారు. ఈ పండ్లలో విటమిన్– ఏ, సీ అధికంగా ఉంటాయి. ఆక్సాలిస్ ఆమ్లం ఒక ప్రత్యేకమైన రుచిని పండుకు అందిస్తుంది. జిల్లాలో ఇవి ఇక్కువగా పండుతాయి. చిత్తూరు, కృష్ణా, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి వంటి జిల్లాల్లో ఎక్కువగా ఉంటాయి. అక్కడ నుంచి దిగుమతి చేసుకుని వ్యాపారులు వివిధ ప్రాంతాల్లో అమ్ముతుంటారు.

హైబ్రిడ్ రకానికి మరింత గిరాకీ

నేరుడులో నాటు పండ్ల కంటే హైబ్రిడ్ రకానికి గిరాకీతోపాటు ధర కూడా ఎక్కువే. నాటు పండ్లు ప్రస్తు తం కేజీ రూ.150 నుంచి రూ.200 వరకు ఉంటే హైబ్రిడ్ కేజీ రూ.200 నుంచి రూ.250 వరకూ పలుకుతోంది. మధుమేహం, రక్తహీనత, బీపీ, కిడ్నీ సమస్యలతో పాటు ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులతో ప్రజలు సతమతమవుతున్నారు. వీటన్నింటినీ నివారణకు ఆస్పత్రులచుట్టూ తిరుగుతూ వేలాది రూపాయలు ఫీజులు చెల్లిస్తూ జేబులు గుల్ల చేసుకుంటున్నారు. అయితే సహజ సిద్ధమైన నేరేడు పండ్లలోని ఔషధ గుణం పలు రకాల దీర్ఘకాలిక వ్యాధులకు మందులతో పని లేకుండా మంచి ఫలితాన్నిస్తుంది. దెందులూరు నియోజకవర్గంలో నేరేడు పండ్లు ఎక్కువగా లభిస్తాయి. మండలంలోని పలువురు నేరేడు పండ్లను తీసుకువచ్చి జాతీయ రహదారిపై విక్రయిస్తున్నారు. పండ్లు తాజాగా ఉండటంతో హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్నాయి.



మార్కెట్లో విక్రయానికి సిద్ధంగా నేరేడు పండ్లు

ఉపయోగాలు ఇలా..

- శరీర భాగాల్లో గాయాలైతే నేరుడు ఆకులను కట్టుగా కడితే రక్తం కారకుండా నిలుపుదల చేయవచ్చు.
- నేరేడు చెట్టు ఆకులు విషాన్ని సైతం పీల్చుకునే గుణాన్ని కలిగి ఉంటాయి.
- పొట్టలో ఉండే నులి పురుగులను నేరేడు నివారిస్తుంది. నోటి క్యాన్సర్ నివారణకు నేరేడు పండ్లు ఎంతగానో దోహదపడతాయి.
- మధుమేహ వ్యాధి పీడితులకు నేరుడు పండు ఒక వరం. గింజలను పొడిచేసుకొని ప్రతి రోజూ వాటిని నీటిలో మరగబెట్టి, వడకట్టి తాగితే శరీరంలో చక్కెర నిల్వలు అదుపులో ఉంటాయి.
- మూత్రాశయ సమస్యలకు నేరేడు ఓ టానిక్‌లా పనిచేస్తుంది. మూత్రం రాక ఇబ్బంది పడే వారికి ఉపయోగపడుతుంది.
- నోటి పూత, చిగుళ్ల వ్యాధులు, దంత క్షయంతో బాధపడేవారు నేరేడు ఆకుల రసాన్ని ప్రతి రోజూ పుక్కలిస్తే ఉపశమనం కలుగుతుంది.
- నోటి పూత వచ్చినప్పుడు రెండు, మూడు నేరేడు పండ్లను తింటే వెంటనే మంట, బాధ నుంచి విముక్తి కలుగుతుంది.
- అతిసార రోగులకు సైతం ఈ పండ్లు ఔషదంగా పనిచేస్తాయి.
- గర్భిణులు నేరేడు పండ్లను తినకూడదు.